www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 17 మే 2024

సబ్సిడీపై విత్తనాలు మంజూరు

- జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రనాయక్

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాలో వేరుశనగ, పచ్చి రొట్ట, జనుము, జీలుగ, పిల్లి పెసర విత్తనాలు రైతులకు 40 శాతం రాయితీపై పంపిణీ చేయడానికి మంజూరయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్ర నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనుము 2578 క్వింటాళ్లు, జీలుగ 2492 క్వింటాళ్లు, పిల్లి పెసర 76 క్వింటాళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వేరుశనగ కే-6 రకం 35323 క్వింటాళ్లు, నారాయణీ 18046 క్వింటాళ్లు, టిసిజిఎస్ 900 క్వింటాళ్లు, కదిరి లేపాక్షి 1114 క్వింటాళ్లు అన్నమయ్య జిల్లాకు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రైతులందరూ తమ రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమకు కావాల్సిన విత్తనాలు రకాలు ఎంపిక చేసుకొని తమ పేరుని నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఈ విషయాన్ని రైతులకు తెలియజేసి రైతుల పేర్లు నమోదు చేయాలని తెలిపారు.

బెట్టింగుల జోరు

సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై బెట్టింగులు జోరందుకున్నాయి. కడప, అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పందేలు కాస్తుండడం పతాక స్థాయికి చేరుకుంది. ఆయా నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపోటములు, ప్రభుత్వ మార్పు, పులివెందులలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సాధించబోయే మెజార్టీలపై పందెం రాయుళ్లు బెట్టింగులు కాస్తుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఉభయ జిల్లాల వ్యాప్తంగా బెట్టింగుల రూపంలో కోట్లాది రూపాయలు చేతులు మారుతుండడం ఆందోళన కలిగిస్తోంది.

అభ్యర్థుల గెలుపోటములపై పందేలు

పులివెందుల మెజార్టీపై ఫోకస్

కమలాపురం, ప్రొద్దుటూరులో పోటాపోటీ

రాజంపేట, రాయచోటి అసెంబ్లీల్లోనూ రూ.కోట్లు చేతులు మారుతున్న వైనం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప, అన్నమయ్య జిల్లాల్లో బెట్టింగులజోరు కొనసాగుతోంది. కడప పార్లమెంట్ పరిధిలోని ఏడు, రాజంపేట పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉన్న సంగతి తెలిసిందే. కడప జిల్లాలోని కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, రాజంపేట పార్లమెంట్ పరిధిలోని రాజంపేట, రాయచోటి నియోజకవర్గ బరిలో నిలిచిన అభ్యర్థుల గెలుపోటములపై పందేలు పెద్దఎత్తున పందేలు కాస్తున్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు అసెంబ్లీ అభ్యర్థుల విజయావకాశాలపై రూ.లక్ష చొప్పున పందేలు కాస్తున్నారు. కడప అసెంబ్లీ అభ్యర్థుల విజయావకాశాలపై ఎన్నికల ప్రచారాల సమయంలోనే పందేలు కాయడం తెలిసిందే. జిల్లాలోని గట్టి పోటీ నెలకొన్న కమలాపురం, ప్రొద్దుటూరు, అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట నియోజకవర్గాల్లో పెద్దఎత్తున పందేలు కాస్తుండడం చర్చనీయాంశంగా మారింది. రాయచోటి అసెంబ్లీ పరిధిలోని ఓ మండలంలో రూ.10 లక్షల చొప్పున పందేలకు దిగారు. పోలింగ్ అనంతరం ఓటింగ్ సరళి, మహిళలు, వృద్ధులు పెద్దఎత్తున పోటెత్తిన నేపథ్యంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటు ప్రతిపక్ష టిడిపికి పడే అవకాశం ఉందని, అధికార వైసిపి వృద్ధులు, మహిళలకు అందించిన సంక్షేమ పథకాల కారణంగా పాజిటివ్ ఓటు పడిందని అంచనాలతో పెద్దఎత్తున పందేలు కాస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

జగన్ మెజార్టీపైనా బెట్టింగులు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్ పులివెందుల నియోజకవర్గంలో సాధించబోయే మెజార్టీపైనా పెద్దఎత్తున పందేలు కాస్తుండడం గమనార్హం. కుప్పంలో నారా చంద్రబాబునాయుడు, పిఠాపురంలో పవన్‌కల్యాణ్, మంగళగిరిలో నారా లోకేష్ మెజార్టీలపై బెట్టింగులు కాస్తున్నారు. రాయలసీమ, ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా ప్రాంతాలకు చెందిన పలు అసెంబ్లీల తరుపున బరిలో నిలిచిన ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల గెలుపోటములపై పందేలకు సిద్ధ పడుతున్నారు. సదరు అభ్యర్థులు సాధించబోయే మెజార్టీలను, పులివెందుల మెజార్టీతో పోల్చి కోట్లాది రూపాయలతో కూడిన బెట్టింగులకు పాల్పడడం మూర్ఖత్వమా లేక తెంపరితనమా అనేది తెలియడం లేదని చెప్పవచ్చు. కడప పార్లమెంట్ వైసిపి అభ్యర్థి అవినాష్‌రెడ్డి గెలుపోటములపై వైసిపి, టిడిపి, కాంగ్రెస్ అనుకూలురు ఎవరు బెట్టింగులకు పాల్పడకపోవడం విశేషంగా చెప్పుకోవచ్చు.

ప్రభుత్వ మార్పుపైనా పందేలు

జిల్లాల్లోని అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటములపై పందేలు కాయడం వరకు బాగానే ఉంది. రాష్ట్రంలో ప్రభుత్వం మార్పుపైనా పెద్దఎత్తున పందేలు కాస్తుండడం గమనార్హం. ఒక్కొక్కరు పరస్పరం రూ.లక్షకు రూ.లక్షన్నర చొప్పున పందేలు కాస్తుడడం ఆసక్తిని కలిగిస్తోంది. ప్రతిపక్ష టిడిపి అనుకూలురు ప్రభుత్వం మారుతుందనే పేరుతో రూ.లక్ష పెడితే ప్రత్యర్థులు రూ.లక్షన్నర పెడుతున్నట్లు తెలుస్తోంది. ఈలెక్కన ఉభయ జిల్లాల వ్యాప్తంగా కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. కడప, రాజంపేట అసెంబ్లీల్లో ఏ పార్టీ అభ్యర్థులు గెలుస్తారో ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనే గుడ్డి అంచనాలతో పందేలకు దిగుతుండడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈలెక్కన జూన్ నాలుగవ తేదీ కౌంటింగ్ సమయానికి ఎందరు ఆస్తులను పోగొట్టుకుని, అప్పుల పాలవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది. భవిష్యత్‌లో జరగబోయే పరిణామాన్ని ఊహించి వర్తమానంలో పందేలు కాస్తుండడం వెర్రితనమనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పీలేరును ముంచెత్తిన వాన

భారీ వర్షానికి జలమయమైన రోడ్లు

చెరువును తలపించిన ఆర్‌టిసి బస్టాండు

ప్లాట్ ఫాంపైకి చేరిన వర్షపు నీరు

బస్టాండ్‌లో నీటితో నిండిన వ్యాపార సముదాయాలు

26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్లాట్ ఫాంపైకి వచ్చిన వర్షపు నీరు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. గురువారం ఉదయం నుంచి తీవ్రంగా కాసిన ఎండకు కాస్త ఇబ్బంది పడ్డ పట్టణ ప్రజలు, మధ్యాహ్నం ఆకాశం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుని వర్షాన్ని కురిపించింది. వాతావరణం కాస్తా చల్లబడ్డంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో 26.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం నీరు కారణంగా ప్రధాన రహదారులు, ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ ప్లాట్ ఫామ్, వ్యాపార సముదాయాలన్నీ జలమయం అయ్యాయి. వాహనాల రాకపోకలకు, పాదాచారులకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బంది కలిగింది. బస్టాండ్‌లోని దుకాణాల వద్దకు నీరు చేరడంతో తమ వస్తువులు తడిపోతాయని వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. ఏ కొద్దిపాటి వర్షం కురిసినా ఆర్టీసీ బస్టాండ్‌లో భారీగా నీరు చేరి చెరువును తలపిస్తూ ప్రయాణికులకు, బస్సుల రాకపోకలకు అసౌకర్యాన్ని కలిగిస్తోంది. బస్టాండ్‌లోకి చేరే నీరు బయటకు పంపే మార్గాన్ని అన్వేషిస్తూ వ్యాపార సముదాయాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి తగిన స్పందన లేదంటూ ప్రయాణికులు, ప్రజలు, వ్యాపారులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు తీసుకొని బస్టాండ్‌ను ముంచెత్తే వర్షపు నీరు చొరబడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. వర్షం పడిన ప్రతి సారీ బస్టాండ్‌లో ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతూనే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

జలమయమైన ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణం

విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

- విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు చర్యలు

- ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య

హాజరైన విద్యుత్ శాఖాధికారులు

ప్రజాశక్తి - కడప

నిర్దేశించిన కాల వ్యవధిలో కొత్త సర్వీసులు విడుదల చేయాలని, లేకపోతే సంబంధిత అధికారులు తిరిగి వినియోగదారులకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని, అలాగే పేరు కుపోయిన విద్యుత్ బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ గురవయ్య పేర్కొన్నారు. గురువారం ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్.రమణ ఆధ్వర్యంలో కడప విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో ఉమ్మడి వైఎస్ఆర్‌జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిజిఎం మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల లైన్లు తెగిపడే ప్రమాదాలున్నాయని, తగు జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వినియోగదారుడు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేసిన 48 గంటలలో గ్రామీణ ప్రాంతాలలో, 24 గంటలలో పట్టణ ప్రాంతాలలో కాలిపోయిన ట్రాన్స్ ఫార్మర్లను మార్చాలని పేర్కొన్నారు. రైతులను వ్యయప్రాసలకు గురి చేయకుండా కాలి పోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చేందుకు అవసరమైన మరమ్మతులు చేసి వాటిని సంస్థ వాహనాల ద్వారా వినియోగదారుని వద్దకు తీసుకెళ్లి కాలిపోయిన స్థానంలో మార్చాలని ఆదేశించారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు అధికంగా ఉన్నాయని, ఫలితంగా కోట్ల రూపాయల ఖర్చు వస్తుందని, ఇది అదనపు ఖర్చు అని తెలిపారు. విధిగా వాటి నిర్వహణ చేసుకుంటూ సంస్థకు నష్టం వాటిల్లకుండా ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలని అరికట్టాలని తెలియజేశారు. పనులలో నాణ్యత ప్రమాణాలను విధిగా పాటించాలని పేర్కొన్నారు. అంతరాయాలు అధికంగా ఉన్నాయని, క్షేత్రస్థాయిలో తిరిగి సమస్యలను గుర్తించి ముందస్తు మరమ్మతులు చేసి అరికట్టాలని సూచించారు. నిరంతర నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ ప్రమాదాల నివారణ లక్ష్యంగా క్షేత్రస్థాయి అధికారులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతులు చేయాలని తెలిపారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు సాయంత్రం, తెల్లవారు జాము సమయాలలో దాడులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వినియోగదారునితో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి విద్యుత్ సమస్యలను సావధానంగా విని పరిష్కరించి సంస్థపై ప్రజలలో సంతృప్తికరస్థాయిని పెంచాలని తెలియజేశారు. విధుల్లో అలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. సమావేశంలో ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఎఇలు, అకౌంట్స్ అధికారులు పాల్గొన్నారు.

అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎపిఎస్‌పిడిసిఎల్ సిజిఎం గురవయ్య

ప్రజా తీర్పు ఎటువైపో...!

సెంటిమెంట్‌పై సర్వత్రా ఆసక్తి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎటువైపు ఉండబోతోందో అభ్యర్థులకు అంతుచిక్కక సతమతమవుతున్నారు. ఈ ఎన్నికలలో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగానూ, కాంగ్రెస్, సిపిఐ, ఆప్ పార్టీలు ఇండియా వేదికగానూ, అధికార వైసిపి ఒంటరిగా బరిలోకి దిగాయి. రాజంపేటలో ప్రధానంగా వైసిపి, టిడిపి మధ్యన పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం, వైద్య కళాశాల ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లడం, అన్నమయ్య డ్యాం కూలిపోవడం వంటి కారణాలు అధికార వైసిపికి ప్రతికూల అంశాలుగా ఉండడంతో టిడిపి అభ్యర్థి సుగవాసి బాలసుబ్రహ్మణ్యం వీటినే ప్రధాన అస్త్రాలుగా మార్చుకొని ఎన్నికల్లోకి దిగారు. తాను గెలిస్తే రాజంపేటలో జిల్లా కేంద్రం ఏర్పాటుతో పాటు వైద్య కళాశాల ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. రాజంపేటలో నిర్వహించిన ప్రజాగళం బహిరంగ సభలో టిడిపి అధినేత చంద్రబాబు సైతం పై రెండు అంశాలు పట్ల బహిరంగంగా రాజంపేట వాసులకు హామీ ఇచ్చారు. టిడిపి శ్రేణులు ఉత్సాహంగా ఎన్నికల ప్రచారంలో దూకుడు పెంచారు. వైసిపి అసెంబ్లీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలే తనకు శ్రీరామ రక్షగా, లోకల్ లీడర్ నినాదంతో ఎన్నికల్లో దిగారు. ఐతే, సుగవాసి బాలసుబ్రమణ్యం నాన్ లోకల్ అభ్యర్థి కావడం చేతను, టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బత్యాల చెంగల రాయుడుకు టికెట్ దక్కకపోవడంతో బత్యాల అనుచరుల్లో అసమ్మతి సుగవాసిని వెంటాడాయి. చివరికి బత్యాల వర్గం సుగవాసికి మద్దతు తెలిపినా బత్యాల మాత్రం రాజంపేట ఎన్నికలలో తల దూర్చకుండా రైల్వేకోడూరు నియోజకవర్గంలో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌కు మద్దతుగా ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థి ఆకేపాటి ఎన్నికల్లో ధన ప్రవాహం సృష్టిస్తే అందుకు ధీటుగా టిడిపి అభ్యర్థి సుగవాసి నిలబడలేకపోయారు. టిడిపి అభిమానులే కాక బత్యాలను వ్యక్తిగతంగా అభిమానించే వారు సైతం బత్యాల స్థానంలో సుగవాసిని ఆమోదించలేకపోయారు. 2024 ఎన్నికలు నువ్వా నేనా అన్నట్లుగా ప్రతి పోలింగ్ బూత్ లోను పోటాపోటీగా ఎన్నికలు జరిగాయి. ప్రజలు ఏ పార్టీకి పట్టం కడతారో పోటీలోని అభ్యర్థులకు అంతుచిక్కక తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికలలో ప్రజానాడి పట్టుకోవడంలో దిక్కుతోచక ఇరుపార్టీల నాయకులు సతమతమవుతున్నారు. ఇదిలా ఉంటే, గత 40 సంవత్సరాలుగా కొనసాగుతున్న రాజంపేట సెంటిమెంట్ పట్ల అన్ని పార్టీల నాయకులలోనూ సర్వదా ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. రాజంపేట నియోజకవర్గంలో ఏ పార్టీ గెలిస్తే రాష్ట్రంలోనూ అదే పార్టీ అధికారం లోకి వస్తుందన్న సెంటిమెంట్ ఈసారి 2024 ఎన్నికల్లోనూ పునరావృతం అవుతుందా అని చర్చించుకుంటున్నారు. ఐతే, ప్రజాతీర్పు ఎటువైపు ఉందో, రాజంపేట సెంటిమెంటు కొనసాగుతుందో లేదో చూడాలంటే జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సిందే.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

'మిట్స్'లో మేనేజ్‌మెంట్ స్టడీస్ సామర్థ్య మీట్

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్‌లో డిపార్ట్మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ వారు సామర్థ్య-ఇంటర్నల్ మేనేజిమెంట్ మీట్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఎంబిఎ విద్యార్థులకు వివిధ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. యువరాజ్ జ్యోతి ప్రజ్వలనతో కార్యకమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబిఎ విద్యార్థులకు వారి నైపుణ్యాలను పెంపొందిచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముక్యంగా విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ చాలా అవసరమని పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సులువుగా లభిస్తాయని చెప్పారు. దేశ విదేశాలలో అద్భుతమైన ఉద్యోగ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. క్రమశిక్షణతో ఉంటూ కష్టపడి చదువుకునే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రాడ్యుయేషన్ స్థాయి అభ్యర్థులు ఎక్కువగా ఆసక్తి చూపుతున్న కోర్సు ఉందంటే అది ఎంబిఎనేనని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలలో ఏ కంపెనీ అయినా కూడా ఎంబిఎ గ్రాడ్యుయేట్ అవసరమని పేర్కొన్నారు. బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ప్రభుత్వ రంగం, ఇన్సూరెన్స్ మొదలైన ఎన్నో రంగాలలో ఉద్యోగ అవకాశాలు మెరుగుగా ఉన్నాయని తెలిపారు. తాము ఎంచుకున్న కోర్సుల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులకు నిర్వహించిన యంగ్ మేనేజర్, బిజినెస్ క్విజ్, పేపర్ ప్రెసెంటేషన్, ట్రేసర్ హంట్ మొదలైన పోటిలను విద్యార్థులకు నిర్వహించారు. కార్యక్రమంలో డీన్ శ్రీమంత బసు, ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, విభాగాధిపతి డాక్టర్ గీతాదేవి, కన్వీనర్ డాక్టర్ జ్ఞానప్రసూన పాల్గొన్నారు.

'వండాడి' ఇంటిపై దాడితో సంబంధం లేదు

- టిడిపి అసెంబ్లీ అభ్యర్థి 'మండిపల్లి'

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై జరిగిన దాడికి మాకు ఎటువంటి సంబంధం లేదని టిడిపి అసెంబ్లీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తన ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిసిలతో ప్రారంభమైన తెలుగుదేశం పార్టీ బిసిలపై దాడులు చేయదన్నారు. 20 ఏళ్లుగా భూ దందాలు, ఎర్రచందనం, డ్రగ్స్, స్మగ్లింగ్, వ్యవహారాలలో ప్రమేయం ఉన్న వ్యక్తి వండాడి వెంకటేశ్వర్లు అని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని నియోజకవర్గ వ్యాప్తంగా పలు గ్రామాల్లో అలజడులు సృష్టించింది వైసిపి నేతలేనని చెప్పారు. ఆయన ద్వారా నష్టపోయిన వారే దాడికి పాల్పడితే ఆ నిందను మాపై మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. ఓటమి భయంతోనే పోలీసుల సమక్షంలోనే టిడిపి ఏజెంట్లపై వైసిపి శ్రేణులు దాడులు జరిపారని తెలిపారు. సిఐ స్థాయి వ్యక్తిని అడ్డుపెట్టుకొని తెలుగుదేశం సానుభూతిపరులు, ఏజెంట్లపై ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి దాడులు చేయించారని ఆరోపించారు. 15 ఏళ్లరాయచోటి ప్రజలను మోసం చేస్తూ కేవలం తన రాజకీయ లబ్ధి కోసం అన్నదమ్ముల లాంటి హిందూ ముస్లింల మధ్య చిచ్చుపెట్టి రాజకీయం చేస్తున్న వ్యక్తన్నారు. పోలీసులు, ఎన్నికల వ్యవస్థపై పూర్తి నమ్మకం ఉందని మేము న్యాయపరంగా పోరాడుతామని తెలిపారు. రానున్నవి మంచి రోజులని కార్యకర్తలు, నాయకులు, అభిమానులు సహనం పాటించాలాన్నారు. రాష్ట్రంలో, రాయచోటిలో రానున్నది తెలుగుదేశం విజయం సాధిస్తుందన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాంప్రసాద్‌రెడ్డి

'మండిపల్లి' గృహ నిర్బంధం

మండలంలోని పడమటికోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో రాయచోటి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆయన ఇంటి వద్ద పోలీసులు పహారాకాస్తున్నారు. రాంప్రసాద్‌రెడ్డి గృహ నిర్బంధం విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు గురువారం ఉదయం ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. గొడవలు జరగకుండా ఆయనను గృహ నిర్బంధం చేశామని పోలీసులు చెబుతున్నారు.

'వండాడి' ఇంటిపై దాడి హేయం

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మార్కెట్ కమిటీ చైర్మన్, ప్రముఖ బిసి నాయకులు వండాడి వెంకటేశ్వర్లు ఇంటిపై దాడి చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల తరువాత కొంతమంది ఉద్దేశపూర్వకంగా దాడులు చేయడం సరైందని కాదన్నారు. వండాడి వెంకటేశ్వర్లును పోలింగ్ రోజునే అసభ్యపదజాలంతో దూషించడం చాలా బాధాకరమని పేర్కొన్నారు. తరువాత కొంతమంది చిల్లర గ్యాంగులను పంపించి వారి ఇంట్లో కార్లు, ఫర్నీచర్ ధ్వంసం చేయడం పిరికిపంద చర్య అని అన్నారు. ప్రస్తుతం రాయచోటి ప్రాంతంలో ఉన్న ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టేవిధంగా, పాత రోజులుకు తీసుకెళ్లే విధంగా కొన్ని అల్లరి గ్యాంగులు తయారవుతున్నాయని పేర్కొన్నారు. పట్టణంలో మైనారిటీలకు చెందిన మొనార్క్ ఫర్నీచర్ దుకాణాన్ని ధ్వంసం చేయడం దారుణమన్నారు. చట్టాన్ని ఎవరు చేతుల్లోకి తీసుకోకూడదని, చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పిన తరువాత అందరినీ సంయమనం పాటించాలని కోరామన్నారు. ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారని, ఇందులో ఎవరి పాత్ర ఉన్నావదలకుండా గట్టి చర్యలు తీసుకుని ప్రస్తుతం రాయచోటిలోఉన్న ప్రశాంతవాతావరణాన్ని కొనసాగించేలా పోలీసులు నడుం బిగించారన్నారు. ఇటువంటి చర్యలకు భవిష్యత్‌లో పాల్పడితే తమలోనూ ఓర్పు, సహనం, సన్నగిల్లి గట్టిగా సమాధానం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామమోహన్

19న పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ

ప్రజాశక్తి - కడప అర్బన్

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ ఈనెల 19 న ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ జిల్లా కడప పాత బస్టాండ్‌లో ఉన్న సిపిఎం కార్యాలయంలో ఉంటుందని ఆ పార్టీ నగర కార్యదర్శి రామమోహన్, నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, రాజేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 1917, మే 1న జన్మించిన సుందరయ్య తన జీవితాన్ని పేదలకు, కష్టజీవులకు అంకితం చేశారన్నారు. వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సారధుల్లో సుందరయ్య ఒకరిని పేర్కొన్నారు. దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. చిన్న వయసులోనే కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, త్యాగనిరతి, అధ్యయనం, ఆచరణ, నిర్మాణ దక్షత ఆయన సొంతమన్నారు. నేటి పరిస్థితుల్లో సుందరయ్య స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సభ్యులు తప్పకుండా హాజరై జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

19న లాసెట్‌పై అవగాహన : జెవివి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఇంటర్మీడియట్, డిగ్రీ తరువాత లా చేయాలనే విద్యార్థులకు ఈ నెల 19న ఒకరోజుపాటు లాసెట్‌పై అవగాహన తరగతులు ఉచితంగా నిర్వహించనున్నట్లు జనవిజ్ఞానవేదిక (జెవివి)అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ వి.వి.శివారెడ్డి, సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జెవివి కార్యాలయంలో ఉదయం 9.00 గంటలకు తరగతులు ప్రారంభిస్తామన్నారు. హాజరు కావాలనుకునే వారు 97054,32038ను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థకు చేరుకున్న భవనం

శిథిలావస్థలో పశు వైద్యశాల భవనం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల పరిధిలోని పశు వైద్యశాల శిథిల వ్యవస్థకు చేరింది. వాటి పైకప్పులు పెచ్చులుడుతూ, గోడలు బాగా దెబ్బతిని, ప్రమాదకరంగా మారాయి. గతంలో విద్యుత్ సర్క్యూట్ కారణంగా లోపల ఉన్న ఎలక్ట్రికల్ సామగ్రి అంతా కాలిపోయింది. ఉన్నత అధికా రులు, పాలకులు వచ్చి పరిశీలించి మరమ్మతులు చేయిస్తామని మామీనిచ్చారే తప్ప తర్వాత ఆ హామీలన్నీ గాలికి వదిలేశారు. పాలకులుగానీ, అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోలేదు. భవనం ఎప్పుడు కూలిపోతుందోనని భయాందోళనతో అధికారులు అక్కడే వైద్య సేవలు అందిస్తున్నారు. నాలుగు వైపులా కిటికీలు కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. అక్కడున్న సామగ్రి భద్రపరచుకోవాలంటే చిన్న గది మాత్రమే ఉందని అన్నారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వంలో ఆధునీకరణకు చర్యలు చేపట్టలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మరమ్మత్తులకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గుండెపోటుతో పిఎసిఎస్ అధ్యక్షులు మృతి

ప్రజాశక్తి-గాలివీడు

వేదమూర్తిరెడ్డి(ఫైల్ ఫొటో)

గాలివీడు వ్యవసాయ సహకార సంఘం పిఎసిఎస్ అధ్యక్షులు మిట్టపల్లి వేదమూర్తిరెడ్డి(77) గుండెపోటుతో మృతిచెందారు. బుధవారం రాత్రి 10 గంటలకు గుండె నొప్పిగా ఉందని అనడంతో కుటుంబ సభ్యులు వెంటనే కారులో రాయచోటి ప్రయివేట్ ఆస్ప త్రికి తీసుకెళ్ళారు. చికిత్స పొందుతూ గుండెపోటు అధికమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. మండలంలో అనేకమందికి భూ సమస్యలపై సూచనలు, సలహాలు ఇస్తూ ఉండే వారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి సర్పంచ్‌లు,ఎంపిటిసిలు, మాజీ ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, వైసిపి, టిడిపి నాయకుల, గ్రామ పెద్దలు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

22 నుంచి ఓపెన్ టు ఆల్ క్రికెట్

ప్రజాశక్తి-నందలూరు

నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ, ఆరవ పల్లెలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అరవపల్లి ప్లేగ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో నందలూరు ప్రీమియర్ లీగ్ 8వ సీజన్ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఈనెల 22వ తేదీ బుధవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు ముమ్మడి శెట్టి సుధాకర్, పల్లె గ్రీస్మంత్ రెడ్డి, శివకోటి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆసక్తి గల టీంలు రూ.1500లు తమ ఎంట్రీ ఫీజును చెల్లించి 20వ తేదీ లోపు జట్ల వివరాలను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ టోర్నమెంట్ లో విజేతగా నిలిచిన వారికి మొదటి బహుమతి కింద రూ.60 వేలు, ద్వితీయ బహుమతి రూ.40వేలు ఇస్తారని చెప్పారు.ఆసక్తి గల టీమ్‌లు 9000527227ను సంప్రదించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఖలీల్ అహ్మద్

వైసిపిని ఆదరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సార్వత్రిక ఎన్నికల్లో వైసిపిని ఆదరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్య వాదాలు తెలుపుతున్నానని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల జరిగిన సరళిపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గురువారం బి.కొత్తకోట పట్టణం, బెంగళూరు రోడ్డులో ఉన్న ఖలీల్ ఫామ్ హౌస్‌లో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్‌అహ్మద్‌ను వైసిపి పట్టణ అధ్యక్షుడు సి.ఆర్.చిన్నికృష్ణ, బి.కొత్తకోట మండలం జెసిఎస్ మండల కన్వీనర్ నేరెళ్ళరెడ్డి హరి, కో-ఆప్షన్ మెంబర్ నాసర్, ఎంఎల్‌ఒ ఇంతియాజ్, వైసిపి నాయ కులు నరసింహనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఓటర్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనకు పట్టం కట్టారని వివరించారు. తంబళ్లపల్లి నియోజవర్గంలో ఎమ్మె ల్యేగా మరో మారు పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, రాజంపేట ఎంపీగా మిథున్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నివర్గాల ప్రజల సంక్షేమం, వారి అభివృద్ధి కొరకు అహర్నిశలు శ్రమించారని అన్నారు. వృద్ధులకు నేరుగా ప్రతి నెల ఒకటవ తేదీన వాలంటీర్ల ద్వారా పింఛన్ ఇంటి వద్ద అందించారని వివరించారు. ప్రజలు తమ మద్దతును వైసిపికి అందిం చారని సిఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మరల ప్రమాణం చేస్తారనా ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ 4న తర్వాత వైసిపి సంక్షేమ పరిపాలన మళ్లీ కొనసాగుతుందని అన్నారు.

సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పౌర గ్రంథాలయ శాఖ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు బాల బాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో గురువారం స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు క్యారం బోర్డు, చెస్, గణిత బోధనా తరగతులను నిర్వహించారు. గణిత ఉపాధ్యాయురాలు నిర్మల జ్యోతి అంకెలు, సంఖ్యలు స్థానిక విలువలు, విస్తరణ రూపం, భిన్నాల పరిచయం గూర్చి తెలిపారు. పుట్టపర్తి సాహితి పీఠం కార్యదర్శి జింక సుబ్రహ్మణ్యం విద్యార్థులకు వేమన పద్యాలు, వాటి భావాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు క్యారం బోర్డు, చెస్ ఆటలకు సంబంధించిన తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రహీం సాహెబ్, రవిబాబు, రెహమాన్ ఖాన్, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

చాపాడు : విద్యార్థులు ప్రతి రోజూ క్రమం తప్పకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి సూచించారు. గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయంలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

Before The Deputy Registrar of Chits/Arbitrator, Tirupati
ARC No.23/2024

M/s Margadarsi Chit Fund Pvt. Ltd., Tirupati
Rep. by its Manager/Foreman ...Disputant
V/s
Mrs. N.Thulasi & Others ...Opponents

NOTICE TO OPPONENTS 3 & 5

Opp3) Mr. Kommineni Vijayakumar, S/o Late K.Subbarayudu, a/a 57 Years, W/as Assistant Director, Animal Husbandry, Area Veterinary Hospital, Railway Kodur, YSR Kadapa Dist. Pin: 516101. Now: Annamaiah Dist. (Residing at H.No.18-1-27A, Dwarakanagar, K.T.Road, Tirupati, Chittoor Dist. Now: Tirupati Dist. Pin: 517502)
Opp5) Mr. Thokala Venkata Subbaiah S/o T.Ramanna a/a 56 years, W/as Livestock Assistant, RL Unit, Utukur Village, Rajampet Mandal, YSR Kadapa Dist, Now: Annamaiah Dist. Pin: 516115. (Residing at D.No.7/21-C-A, Gangireddypalem Street, Rajampet, YSR Kadapa Dist. Now: Annamaiah Dist., Pin: 516115)

Please take notice that the above Dispute is posted to 25.05.2024 for your apperance before the above said Honourable District Registrar/Arbitrator Office, Tirupati at 10.30 A.M. either in person or through an Advocate and raise your objections if any, failing which the case will be decided in your absence, as exparte.

Date of Hearing : 25.05.2024

K.RAMESH BABU
Advocate, Tirupati. Cell: 9440095932

టిబి నివారణకు టీకా తప్పనిసరి

- డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ

మదనపల్లి : బిసిజి టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-మదనపల్లి

సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులలో టిబి కూడా ఒకటి అని , ఈ టిబి వ్యాధి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీ పేర్కొన్నారు. 18 ఏళ్ళు వయస్సు దాటిన వారిని ప్రత్యేక కేటగిరి కింద వారిని గుర్తించి వారి సమ్మతితో ఉచితంగా ప్రతి గురువారం అన్ని సచివాలయంలలో బిసిజి టీకా అందిస్తున్నామని తెలిపారు. రాష్టంలో అన్నమయ్య జిల్లా కూడా బిసిజి టీకా పంపణికి పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయబడిందని అన్నారు. ఆరోగ్యకార్యకర్తలకు బిసిజి టీకా ఏ విధంగా ఇవ్వాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిచడం జరుగుతుందని చెప్పారు. కేంద్రప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, అన్ని రకాల ముందుస్తు పరీక్షలు నిర్వహించి ఈ బిసిజి టీకాను అందుబాటులో తీసుకోని వచ్చిందని అన్నారు. ప్రజలు అందరు అపోహలు వీడి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వాక్సిన్ ను తీసు కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా రామారావు కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వాక్సిన్ గురించి ప్రతి ఉప ఆరోగ్య కేంద్రాలలో, ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యేకంగా ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ వాక్సిన్ వల్ల ఎటువంటి నష్టం ఉండదని, ఎటువంటి దుష్పరిమాణాలు రావని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి టిబి యూనిట్ సిబ్బంది ప్రభాకర్, సుశీల, వనజకుమారి, తరుణ్, సునీత ఆరోగ్య కార్యకర్తలు సరితా, సోని, ఆశా కార్యకర్తలు, 104 నోడల్ ఆఫీసర్ ప్రవీణ్, కమర్‌వల్లి పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలో వయోజన క్షయ టీకాలను వైద్యాధికారులు ఎంవి.కిషోర్‌కుమార్‌రెడ్డి, పి.జవహర్‌బాబు ఆధ్వర్యంలో అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి నూటికి నూరు శాతం టీకాలు అందించాలని చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు నూరు శాతం వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయించాలని ఆదేశించారు. ఆరోగ్య విస్తరణ అధికారి జి.జయరామయ్య టిబి వ్యాధికి సంబంధించిన రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. సప్రతి సచివాలయం నందు 70 మంది చొప్పున టీకాలను వేయాలని విస్తరణ అధికారి తెలిపారు. సచివాలయ జనాభా ప్రకారము టిబి కేసులను కనుగొనాలని చెప్పారు. అడల్ట్ బిసిజి వ్యాక్సినేషన్ సిహెచ్‌ఒలు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎక్కువ మందిని ప్రోత్సాహం చేసి బిసిజి టీకాలువేయించాలన్నారు. కార్యక్రమంలో జె.భారతమ్మ, గణాంక అధికారి షేక్ ఇస్మాయిల్, ఎఫ్‌ఎన్‌ఒబి అలివేలు, మంగబాయి, అటెండర్ సునీత పాల్గొన్నారు.

టీకా కేంద్రాల్లో డిపిఎంఒ తనిఖీ

రాయచోటి టౌన్ : వయోజన టిబి టీకాల కేంద్రాలను జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ రియాజ్‌బేగ్, డిఎన్‌ఎంఒ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. రాయచోటి అర్బన్ పరిధిలోని కొత్తపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రం, దేవలంపల్లి పిహెచ్‌సి పరిధిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న క్షయ టీకాల పంపిణీ ని పరిశీలించారు. టీకాల కేంద్రంలో ప్రోటోకాల్ ప్రకారం ఉండవలసిన ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. లబ్ధిదారులకు ఈ టిబి వ్యాక్సిన్ ఎందుకు ఇస్తున్నాము, వ్యాక్సిన్ వల్ల ఏ జబ్బును నివారణ చేయవచ్చు వారికి క్షణంగా వివరించి చెప్పాలని అన్నారు. ఒకవేళ ఏమైనా వ్యాక్సిన్ వల్ల ప్రతికూల పరిస్థితి ఏర్పడితే ఎవరిని, ఎప్పుడు సంప్రదించాలి అనే దానిపై తప్పనిసరిగా తెలపాలని ఆదేశించారు. ప్రతి గురువారం బిసిజి టీకా దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే ఈ టీకాకు అర్హులైన వారిని హెడ్ కౌంట్ సర్వే చేసి గుర్తించామని, వారందరిని ప్రోత్సాహించి టీకాలు వేసి టిబి ముక్తభారత్ సాధన లక్ష్యం సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుపిహెచ్‌సి వైద్యులు, దేవలంపల్లి పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో క్షయ వ్యాధి పూర్తిగా నివారించేందుకే ఇసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కోసవారిపల్లి పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్ ముని కుమార్ లు తెలిపారు.మండలంలోని 12 విలేజ్ క్లినికల్‌లో ఇసిజి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తంబళ్లపల్లి వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రి లో తంబళ్లపల్లి గైనకాలజిస్ట్ డాక్టర్ తేజస్వి ప్రారంభించారు. టిబి మందులు వాడుతున్న వారికి, గర్భినులు, పాలిచ్చే తల్లులు,హెచ్‌ఐవి బాధితులు, జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడే వారికి. కిడ్నీ, లివర్ మార్పిడి చేసుకుని మందులు వాడుతున్న వారికి, మూడు నెలల ముందు రక్తదానం చేసిన వారు ఈ వ్యాక్సిన్ వేసుకోకూడదన్నారు. మండలంలో 270 మందికి ఇసిజి వ్యాక్సిన్ వేసినట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు:** నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామంలో బిసిజి టీకా కార్యక్రమాన్ని మండల ప్రభుత్వ వైద్యాధికారి శరత్‌కమల్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు బిసిజి అడల్ట్ వాక్సినేషన్ ప్రారం భించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కమల్ మాట్లాడుతూ ఈ వాక్సిన్ 18 సంవత్సరాలు నిండిన షుగర్ వ్యాధిగ్రస్తులు, పొగ తాగే వారు, చికిత్స కాలం పూర్తయిన టిబి రోగులు, బిఎంఐ రోగులు వేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ జయప్రకాష్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కలకడ :బిసిజి వ్యాక్సిన్ పట్ల అవగాహన కల్పిస్తున్న వైద్యులు

డెంగీ పట్ల జాగ్రత్తలు పాటించాలి

నందలూరు : డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-పీలేరు

ఈడీస్ ఈజిప్ట్ దోమ కాటువల్ల వచ్చే డెంగీ జ్వరాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికి ప్రమాదమని, వీటి అంతానికి సమిష్టి కృషి అవసరమని పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకంగా పరీక్షిస్తే తప్ప డెంగ్యూ జ్వరం ఉన్నట్లుగా నిర్ధారించలేమని, జ్వరం, తలనొప్పి, నీరసం, ఒంటిపై ఎర్రటి దద్దుర్లు, ముక్కు, చిగుళ్ళు నుండి రక్త స్రావం, అపస్మారక స్థితి, మొదలగు లక్షణాలు డెంగ్యూగా అనుమానించి తక్షణ చికిత్స పొందాలని తెలిపారు. 12 ఏళ్ల లోపు పిల్లలకు, 60 ఏళ్లు దాటిన వృద్ధులకు, గర్భిణులు మధుమేహులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, రక్తహీనత సమస్య ఉన్నవారికి ఇది చాలా ప్రమాదకరమని అన్నారు.కావున దోమ పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవడం ఎంతైనా అవసరమని హెచ్చరించారు. ఫ్రైడే డ్రైడే చేస్తూ నీటి నిలువలపై మూతలుపెట్టాలని, ఇళ్లల్లో పగిలిన కప్పులు, పాత టైర్లు, ఎయిర్ కూలర్లు, వాడిన కొబ్బరి బోండాలు లాంటి వాటిని ఇంటి చుట్టు ప్రాంతాల్లో లేకుండా చూసుకోవాలని సూచించారు. దోమల అంతానికి అందరూ బాధ్యత వహించాలని డాక్టర్ చంద్రశేఖర్ తెలియజేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ విద్యా సాగర్, సిహెచ్‌ఓ జయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్లు ఉష రాణి, కొండయ్య, సూపర్వైజర్లు శ్రీనివాసులు, చిన్నయ్య, కుసుమ, సిహెచ్‌ఓలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. **కలకడ :** డెంగీ వ్యాధి పట్ల జాగ్రత్తలు పాటించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జవహర్‌బాబు పేర్కొన్నారు. గురు వారం మండలం లోని పాపిరెడ్డిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రకోటపల్లి పిహెచ్‌సిలో ముందుగా సిబ్బం దికి జాతీయ డెంగీ జాతీయ కార్యక్రమం ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. వేపాకు పొగ- దోమలకు సెగ, చిన్నప్రాణులు-పెను ప్రమాదం, దోమ పుట్టరాదు-దోమ కుట్ట రాదు, నెట్ కట్టు-దోమ పట్, ఒకే మాట-పరిశుభ్రత బాట అంటూ నినాదాలు పాపిరెడ్డి గారిపల్లి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జి.జయరామయ్య ఎంపిహెచ్‌ఇఒ, ఎంపిహెచ్‌ఎస్ వెంకటేశ్వరరావు, బి.రెడ్డమ్మ, సిహెచ్‌ఒలు, రాజసులోచన, ఎస్.లావన్య, మహ్మద్‌షరీఫ్, ఆరోగ్య కార్యకర్తలు వాణి, రమణమ్మ, డి.వరలక్ష్మి.భాగ్యమ్మ ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. **రామాపురం :** దోమలను అరికడదాం ప్రాణాంతకమైన డెంగీని పారదోలుదామని మండలం వైద్యాధికారులు డాక్టర్ వినోద్‌కుమార్, డాక్టర్ దివ్యశ్రీ పేర్కొన్నారు. జాతీయ డెంగీ వ్యాధి దినోత్సవ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి నుంచి మూడు రోడ్ల కూడలి మీదుగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సిహెచ్‌ఓ ఎలియాజరు, పిహెచ్‌ఎన్ విజయలక్ష్మి, హెల్త్ సూపర్వైజర్ ఉమామహేశ్వరి, ఎంఎల్ హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు , ఆశాలు పాల్గొన్నారు. **నందలూరు:** నిల్వ ఉన్న నీటిలో అబెట్ ద్రావణం, వేస్ట్ ఆయిల్‌ను చల్లి దోమలు వృద్ధి చెందకుండా నివారించాలని మండల వైద్యాధికారి డాక్టర్ కె.శరత్‌కమల్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ కూడలి వరకు డెంగీ నివారణ నినాదాలు చేస్తూ వైద్య సిబ్బంది, ఆశాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కమల్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి పగటిపూట కుట్టే 'ఈడిస్ ఈజిప్ట్ ఐ' దోమల వల్ల మాత్రమే వ్యాప్తి చెందుతుందని అన్నారు. తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ వెంకటనారాయణ, సునీల్ కుమార్, ఎంపిహెచ్‌ఒ లక్ష్మయ్య, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరులో ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

బోరుకు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి-టి.సుండుపల్లి

మరమ్మతులకు నోచని బోరు

మండల పరిధిలోని మడితాడు గ్రామ పంచా యతీలో భయనేని వారిపల్లె దళితవాడలో తాగునీటి బోరు చెడిపోయి నీటికోసం ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో వంద కుటుంబాల వారు నివాసమున్నారని వంద కుటుంబాలకు ఒకే ఒక్క బోరు మాత్రమే ఉందని అన్నారు. ఆ బోరుకు కూడా పనిచే యకుండా పోయిందని అన్నారు. బోరుకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుక రావాలని సచివాలయ సెక్రటరీ, గ్రామపంచాయతీ సర్పంచ్, ఎండిఒకు వినతి పత్రం కూడా అందించా మని గ్రామస్తులుకె.వి.రమణయ్య, వి.విజయభాస్కర్, కె.నరసింహులు, నారాయణ, చక్రపాణి, చాణిక్యలు తెలిపారు. విద్యుత్ ఉన్నప్పుడు ఏటిలో బోరు నీళ్ల వస్తా యని, ప్రస్తుతం విద్యుత్ కొరత తీవ్రంగా ఉండటంతో నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని అన్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

పేదలకు అల్పాహారం అందజేత

ప్రజాశక్తి-నందలూరు

దివంగత భూమిరెడ్డి వెంకట కృష్ణయ్య 5వ వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణార్థం భూమిరెడ్డి కుటుంబీకుల సౌజన్యంతో స్థానిక లయన్స్‌క్లబ్, వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపల్లి పంచాయతీ అరవపల్లి ఆర్అండ్‌బి బంగ్లా ఆవరణలో గురువారం పేదలకు అల్పాహార వితరణ చేయడం జరిగింది. కార్యక్రమంలో రైల్వే మెడికల్ ఆఫీసర్ శ్రీబచ్చు జయభాస్కరరావు, లయన్ కుర్రామణి యాదవ్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోడ పోతుల రాము, దాసరి నరసింహులు అడ్వకేట్, వాకర్ శ్యామనబోయిన గురు ప్రసాద్,సుధీర్, పోతురాజు మస్తానయ్య, గంధం గంగాధర్, సురేష్, వెంకటయ్య, ఆంజనేయులు, సునీల్‌రెడ్డి, గొబ్బిళ్ళ మణి కృష్ణ పాల్గొన్నారు.

అల్పాహారం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

విభిన్నప్రతిభావంతులకు సరుకులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శ్రీనివాస థియేటర్‌లో ఉన్న కిరాణా మర్చంట్ ఏకాశి మహేష్‌బాబు కుమారుడు ఏకాశి ఇషాంత్ లతాక్షర్ మొదటి జన్మదిన సందర్భంగా గురువారం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ముద్దనూరు రోడ్డులోని విభిన్నప్రతిభావంతుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుని జన్మదినం విభిన్నప్రతిభావంతుల మధ్య జరుపు కోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఏటా బాబు జన్మదిన సందర్భంగా వీరికి తమ వంతు చేయూతనందిస్తామని తల్లిదండ్రులు మహేష్ బాబు, చిరు మౌనిక పేర్కొన్నారు. అనంతరం తన మనవడు ఇషాంత్ జన్మదిన సం దర్భంగా అమ్మ సేవా సమితి అధ్యక్షుడు పూల రమేష్ బాబు విభిన్న ప్రతిభా వంతులకు ఆర్థికసాయం అందించారు. మహేష్ కుటుంబ సభ్యులను విభి న్నప్రతిభావంతుల నెట్ వర్క్ తరపున రఘునాథరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సుజాత, లక్ష్మీదేవి, చరణ్, అరుణ్, అనిల్ పాల్గొన్నారు.

అధికారంలో ఉన్న పార్టీ వర్గీకరణకు కట్టుబడాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్‌లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా వర్గీకరణకు కట్టుబడి ఉండాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్‌యన్ రాజా మాదిగ తెలిపారు. స్థానిక సంజీవ్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నరసింహ, చెన్నమ్మ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు డివిజన్ నూతన కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ ఇరు పార్టీలకు మాదిగలు ఓట్లు వేశారని ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన మాదిగల ఓట్లతోనే అధికారంలోకి వస్తారన్నారు. వచ్చాక మాదిగలకిచ్చిన మాటను నిలబెట్టు కోవా ల్సిన అవసరం ఈ నాయకులకు ఉందన్నారు. జూన్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోయే పార్టీ మాదిగలను మోసం చేస్తే ఆ తర్వాత ఆ పార్టీకి రాజకీయ భవిష్యత్తు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మాదిగలు ఏకమవుతారని తెలిపారు.

ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో వివేకానంద విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో శ్రీ వివేకానంద పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని శ్రీ వివేకానంద పాఠశాలలో ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలో 1872 ర్యాంకు సాధించిన విద్యార్థి హమేర అంజుమ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాంక్ సాధించిన విద్యార్థికి కర్నూలు జిల్లాలో బనవాసి రెసిడెన్షియల్ కళాశాలలో అడ్మిషన్ వచ్చిం దన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ జాఫర్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కూరగాయల సంతలో ఫోకస్ లైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-గాలివీడు

గాలివీడు పంచాయతీ పరిధిలో కూరగాయలు సంత, ఫక్కి రారెడ్డిగారిపల్లి దిగువ భాగంలో ఉన్న గొర్ల సంత వద్ద ఫోకస్ లైట్లు ఏర్పాటు చేశారు. కూరగాయలు సంతలో వ్యాపారులు రాత్రి 7, 8 గంటల వరకు సరుకు లను సర్దుబాటు చేసుకుంటూ ఉంటారు. అక్కడ ఫోకస్ లైట్లను ఏర్పాటు చేయ డంతో తమకు కొంత ఊరట లభించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఫక్కి రారెడ్డి గారిపల్లిలో ప్రతి గురువారం గొర్ల సంత జరుగుతుంది. బుధవారం రాత్రి నుంచే వాహనాలలో గొర్రెలు, మేకలు తీసుకొని వస్తారని, అటువారికి కూడా ఫోకస్ లైట్లు సౌకర్యవంతంగా ఉన్నాయని చెబుతున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో చొరవ తీసుకొని ఫోకస్ లైట్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

జాతరకు హాజరైన ముక్కా రూపానందరెడ్డి, జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

గంగమ్మ తల్లి జాతరకు భక్తులు పోటెత్తారు. రైల్వే కోడూరు గంగమ్మ తల్లి జాతరకు ఒక ప్రత్యేకత ఉంది నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచే కాక రాజంపేట, తిరుపతి తదితర ప్రాంతాల నుంచి బంధువులు, మిత్రులు అధిక సంఖ్యలో తరలివచ్చి గంగమ్మకు మొక్కులు తీర్చుకుని దర్శించుకుని అమ్మవారి ఆశీర్వాదాలు పొందుతుంటారని నిర్వాహకలు తెలిపారు. రైల్వేకోడూరు టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్, మాజీ ఎంపిపి తిరుపాల్, టివి రమణారెడ్డిలు గంగమ్మను దర్శించుకున్నారు.

సర్పంచ్ శ్యామలమ్మ ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్లపల్లి మండలంలోని కన్నమడుగు సర్పంచ్ శ్యామలమ్మ అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకునక్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆయన సతీమణి కవితమ్మతో కలిసి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు.శ్యామలమ్మ కుమారులు రామకృష్ణ రెడ్డి, రవిశంకర్ రెడ్డితో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచిం చారు. ఆయన వెంట నల్లగుంట్ల మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

డి.కుషివర్ధన్(ఫైల్‌ఫొటో)

మతిస్థిమితం లేని బాలుడు అదృశ్యమైన సంఘటన మండలంలో చోటు చేసు కుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని పంజు రమ్మవీధిలో నివాసముం టున్న డి.మహేష్‌బాబు కుమారుడు డి.కుషివర్ధన్(12) గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. బంధువులు, చుట్టుప్రక్కల ఇళ్లలో బాలుడి కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదని చెప్పారు. బాలుడి ఆచూకీ లభించకపో వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేర కు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి ఆచూకీ లభి స్తే 6303624722 అనే మొబైల్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.